# సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024




**పత్తి క్వింటాల్‌కు రూ.6,722**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌యార్డులో గురువారం పత్తి క్వింటాల్ గరిష్ట ధర రూ.6,722, కనిష్టం రూ.5,732, సరాసరి ధర రూ.6,477 పలికింది.



**రోడ్డు భద్రతపై అవగాహన**

ధర్మారం: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఎర్రగుంటపల్లిలో గురువారం గ్రామస్తులకు ఎస్సై అశ్విని అవగాహన కల్పించారు.

గరిష్టం/కనిష్టం 31.8/22.6

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలిగా ఉండే అవకాశం ఉంది. పగలు ఎండ తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### జాతీయస్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపిక



మణికీర్తనయాదవ్

సుల్తానాబాద్/కాల్వ శ్రీరాంపూర్: ఈనెల 11న ఢిల్లీలో జరిగే 45వ జాతీయస్థాయి సీనియర్ త్రోబాల్ పోటీలకు మణికీర్తన యాదవ్ ఎంపికై నట్లు పీఈటీ సంపత్‌కుమార్ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన మణికీర్తన కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభకనబరిచి జాతీయస్థాయికి ఎంపికైంది.

### వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి



కాట్నపల్లిలో పర్యటిస్తున్న డీపీవో చంద్రమౌళి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గ్రామాలు పరిశుభ్రంగా తయారు కావాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం మండలంలోని కాట్నపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులను పరిశీలించడంతో పాటు అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పరిసరాల శుభ్రతతోనే రోగాల బారిన పడకుండా ఉంటామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రఘుపతిరెడ్డి, కార్యదర్శి శంకర్, ఏఎన్ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్ స్వప్న, కారోబార్ వెంకన్న తదితరులున్నారు. అలాగే మండలంలోని నారాయణపూర్ గ్రామంలో మద్యపానం, గుట్కా, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని గ్రామస్తులకు ఎస్సై వినీత అవగాహన కల్పించారు.

### భూ సేకరణపై రైతులతో ఆర్డీవో సమావేశం



రైతులతో సమావేశమైన ఆర్డీవో హనుమనాయక్

రామగిరి(మంథని): జాతీయ రహదారి నం.163జీ నిర్మాణం కోసం భూ సేకరణలో భాగంగా మండలంలోని బేగంపేట గ్రామంలో గురువారం రైతులతో మంథని ఆర్డీవో హనుమనాయక్ సమావేశమయ్యారు. భూమికి నష్ట పరిహారం ఆర్ఎఫ్‌సీటీ ఎల్ఏఆర్ఆర్ 2013 చట్టం ప్రకారం చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు అడిగిన సందేహాలకు ఆర్డీవో సమాధానం తెలిపారు. తహసీల్దార్ రాంచందర్‌రావు, గిర్దావర్ రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

### 13న జాబ్ మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 13న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో నిర్వహించే జాబ్ మేళాకు 25 నుంచి 32 ఏళ్ల లోపు వయస్సు గల డిగ్రీ, ఎంబీఏ అర్హతగల యువకులు మాత్రమే హాజరుకావాలని కోరారు. ఎంపికై నవారు జిల్లా పరిధిలో పనిచేయాల్సి ఉంటుందని, అర్హత, ఆసక్తిగలవారు అన్ని సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 89853 36947, 95026 42441 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### విద్యుత్ సిబ్బందికి సహకరించాలి

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్: ప్రభుత్వం అమలు చేయనున్న గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందాలనుకునే వినియోగదారులు ఇంటి వద్దకు వచ్చే విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ బొంకూరి సుదర్శన్ కోరారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇచ్చిన దరఖాస్తు రశీదు, ఆహారభద్రత (రేషన్ కార్డు) నంబరు, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకుని అధికారులకు సమాచారమివ్వాలన్నారు. సదరు అధికారులు ఇంటికి వచ్చినపుడు అందుబాటులో లేని పక్షంలో ఆ వివరాలను సమీపంలోని విద్యుత్ ఏఈ, ఏఈవో కార్యాలయాల్లో అందించాలని పేర్కొన్నారు.

## అలరించిన బొమ్మల కొలువు




గోదావరిఖని(రామగుండం): ఏటా సంక్రాంతి పండుగ సందర్భంలో నిర్వహించే బొమ్మల కొలువును గురువారం ఆర్జీ–1 లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు చింతల లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సింగరేణి సీఅండ్ఎండీ సతీమణి శారద ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయోధ్యలోని బాలరాముని ఆలయ నమూనా, పర్ణశాల, పల్లెటూరి వాతావరణం, మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర తదితర నమూనాలతో కూడిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుంది. ఈసందర్భంగా లేడీస్ క్లబ్ సభ్యులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆపరేషన్స్ డైరెక్టర్ సతీమణి కళ్యాణి, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు మాలతి, అలవేణి, ప్రియదర్శిని, పద్మ, లలిత, చిలుక లక్ష్మి, కవిత, స్వరూప, రమ, తార, హేమలత, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి పోటాపోటీ

- రేసులో ఎస్.కుమార్, రాజేందర్, అయోధ్య రవి, బాల్‌రెడ్డి
- టికెట్‌పై ఎవరి ధీమా వారిదే.. కార్యక్రమాల్లో వేగం పెంచిన ఆశావహులు
- పార్టీ పరిస్థితిని విశ్లేషిస్తూ..గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్న అధిష్టానం




# కమలం బరి.. నేతల గురి

సాక్షి, పెద్దపల్లి: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరపున ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. జాతీయ అంశాలతో ప్రభావితమయ్యే నియోజకవర్గమవడం, ఎస్సీ స్థానం కావడంతో ఇక్కడ గెలుపును ఆ పార్టీ నిర్దేశించుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో గణనీయమైన ఓట్లు సాధించకపోయినా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు జాతీయ అంశాల ఆధారంగా తమకు మద్దతు పలుకుతారని బీజేపీ అధిష్టానం అంచనా వేస్తుంది. ఇందులో భాగంగా రాబోయే ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా బీజేపీ అంతర్గతంగా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు చేస్తుంటే, మరోవైపు ఇక్కడ పోటీ చేసేందుకు సిద్ధమవుతోన్న నేతలు నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్నారు. పార్టీ దృష్టిలో పడేందుకు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో వాల్‌రైటింగ్స్ చేయిస్తూ, ఫ్లెక్సీలు కూడా కట్టిస్తున్నారు. వికసిత్ సంకల్ప్ భారత్ వంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతున్నారు.

**టీడీపీ, బీజేపీ పొత్తులో గెలుపు**

పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి కంచుకోటగా నిలుస్తోంది. అలాగే బీజేపీ సైతం ప్రత్యక్షంగా పోరులో నిలవక, పొత్తులో భాగంగా టీడీపీకి పలుమార్లు సీటు కేటాయించింది. అందులో భాగంగా 2004లో టీడీపీ తరుపున డాక్టర్ సుగుణకుమారి పోటీ చేసి గెలిచారు. 2019లో బీజేపీ తరుపున ఎస్.కుమార్ నిలవగా 92,606 ఓట్లు సాధించారు. పార్లమెంట్ పరిధిలో గతంలో కంటే ఓటు బ్యాంకు స్థిరంగా పెరగడాన్ని గమనిస్తోన్న అధిష్టానం గతంలో వైఫల్యాలకు గల కారణాలను విశ్లేషించుకుంటుంది. పొత్తులో టీడీపీ గెలిచిందని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీజేపీకి సానుకూల వాతవరణం నెలకొన్న నేపథ్యంలో సరైన అభ్యర్థిని దింపి పక్కా ప్రణాళికతో గెలవవచ్చని భావిస్తుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యర్థులకు గట్టి పోటీనిచ్చే అభ్యర్థులను బరిలో దింపేలా అధిష్టానం ఆలోచిస్తుంది. ఇందులో భాగంగా ఇదే నియోజకవర్గంలోని మాజీ ఎంపీ, మాజీ మంత్రిని పార్టీలో చేర్చుకొని టిక్కెట్ ఇచ్చేందుకు సంప్రదింపులు చేస్తున్నట్లు సమాచారం.

**ఎంపీ టికెట్ రేసులో వీరే..**

పెద్దపల్లి పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు పలువురు నాయకులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. పాలకుర్తి మండలానికి చెందిన ఐఏఎస్ నరహరి క్లాస్‌మేట్, అతను స్థాపించిన ఆలయ ఫౌండేషన్ సీఈవో మిట్టపల్లి రాజేందర్‌కుమార్, విశ్వహిందూ పరిషత్ నాయకుడు అయోధ్య రవి, బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగాల కుమార్, కరీంనగర్‌కు చెందిన బీజేపీ ఎస్సీ రాష్ట్ర మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, క్యాతం వెంకటరమణ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వీరిలో ముగ్గురి పేర్లతో కూడిన షార్ట్ లిస్టు బీజేపీ అధిష్టానానికి చేరింది. అయితే పార్టీ టికెట్ వీరిలో ఎవరికైనా ఇస్తారా, చివరి నిమిషంలో మరెవరినైనా రంగంలోకి దింపుతారా అనే అంశం ఆసక్తిగా మారింది.

# ‘పెద్దపల్లి’ ఓటర్లు 15,94,392

- తుది జాబితా ప్రకటించిన ఎన్నికల సంఘం

గోదావరిఖని(రామగుండం): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటరు తుది జాబితా ప్రకటించింది. మార్పులు, చేర్పుల అనంతరం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో 15,94,392 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 8,05,755, పురుషులు 7,87,140, ట్రాన్స్‌జెండర్ 101, సర్వీస్ ఓటర్లు 1,396 ఉన్నారు. తుది జాబితా ప్రకటించిన నేపథ్యంలో త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. పార్లమెంట్ పరిధిలో పురుషుల కన్నా మహిళ ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. అత్యధికంగా మంచిర్యాల అసెంబ్లీ పరిధిలో ఓటర్లున్నారు. రెండోస్థానంలో పెద్దపల్లి, మూడో స్థానంలో మంథని నిలిచింది. అభ్యర్థులు నామినేషన్ వేసేవరకు కొత్త ఓటర్లు పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉంది. సింగరేణి కార్మికులు అత్యధికంగా ఉన్న పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఈసారి వారి ఓట్లు ప్రభావం చూపే అవకాశం ఉంది.

**పార్లమెంట్ పరిధిలోని ఓటర్లు..**

| అసెంబ్లీ | పురుషులు | మహిళలు | ఇతరులు | సర్వీస్ఓటర్లు | మొత్తం |
|---|---|---|---|---|---|
| పెద్దపల్లి | 1,26,404 | 1,29,965 | 07 | 264 | 2,56,640 |
| మంథని | 1,17,271 | 1,21,820 | 17 | 155 | 2,39,263 |
| రామగుండం | 1,10,255 | 1,09,970 | 26 | 213 | 2,20,464 |
| ధర్మపురి | 1,11,962 | 1,17,647 | 06 | 133 | 2,29,748 |
| చెన్నూర్ | 95,974 | 97,264 | 07 | 134 | 1,93,379 |
| బెల్లంపల్లి | 86,802 | 88,530 | 13 | 163 | 1,75,508 |
| మంచిర్యాల | 1,38,472 | 1,40,559 | 25 | 334 | 2,79,390 |
| మొత్తం | 7,87,140 | 8,05,755 | 101 | 1,396 | 15,94,392 |

# పనికి కాదు.. బడికి రావాలె

- ‘పది’ పాసయితేనే మంచి భవిష్యత్
- విద్యార్థి ఇంటికెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చిన డీఈవో మాధవి
- గైర్హాజరయ్యే టెన్త్ విద్యార్థులపై గురి




పవన్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న జిల్లా విద్యాధికారి మాధవి

పెద్దపల్లిరూరల్: ‘పవన్.. చాలా రోజుల నుంచి బడికి ఎందుకు రావడం లేదు. కొద్దిరోజుల్లో టెన్త్ పరీక్షలుంటాయి. స్కూల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. బడికి రాకుండా పనికి పోతె ఎట్లా’.. అంటూ జిల్లా విద్యాధికారి మాధవి మందలించారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట జెడ్పీ హైస్కూల్‌లో చాలా రోజుల నుంచి పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించి వారి ఇండ్లకు వెళ్లి స్కూల్‌కు రప్పించేలా హెచ్ఎం పురుషోత్తం, కాంప్లెక్సు సీఆర్‌పీ తిరుపతి, సిబ్బందితో కలిసి గురువారం తిరిగారు. విద్యార్థి పవన్ ఇంటి వద్ద కనిపించగా, పదో తరగతిలో బాగా చదివి మంచి మార్కులతో పాసైతేనే భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. రెగ్యులర్‌గా బడికి రావాలని విద్యార్థికి సూచించారు.

**ప్రైవేట్ స్కూళ్లు నిబంధనలు పాటించాలి**

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని డీఈవో మాధవి అన్నారు. పెద్దపల్లిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలతో సమావేశమై పలు సూచనలు చేశారు. పాఠశాలలో పేరు నమోదు చేసుకున్న ప్రతి విద్యార్థి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో మల్లేశ్, ఎంఈవో సురేందర్‌కుమార్, హెచ్ఎం అరుణకుమారి, కాంప్లెక్సు సీఆర్‌పీ బాలసాని వెంకటేశం, రవీందర్ తదితరులున్నారు.





**రామగిరి ఖిలాలో కలెక్టర్**

రామగిరి(మంథని): ప్రముఖ పర్యాటక క్షేత్రమైన రామగిరి ఖిలాను గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సందర్శించారు. బేగంపేట గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి ఖిలా పైకి వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్‌రెడ్డి, మంథని సబ్ డివిజన్ అసిస్టెంట్ ఇంజినీర్ అనుదీప్ ఉన్నారు.

## ఒడిశా కార్మికుడిపై యజమాని దాడి



కార్మికుడి వీపుపై వాతలు

రామగిరి(మంథని): రామగిరి మండలం కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్న వలస కార్మికుడిపై దాడి చేసిన ఘటనలో యజమానిపై కేసు నమోదైంది. పోలీసుల వివరాలు.. కల్వచర్ల గ్రామంలోని ఇటుక బట్టీలలో ఒడిశా రాష్ట్రానికి చెందిన సుమారు 100 మంది వలస కార్మికులు పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం ప్రసాంతాచారియా అనే కార్మికుడిపై యజమాని సైండ్ల విష్ణు దాడికి పాల్పడ్డాడు. విచక్షణ రహితంగా దాడి చేయడంతో వలస కార్మికులంతా గురువారం రాత్రి రామగిరి పోలీసుస్టేషన్ ఠాణా మెట్లక్కారు. ఇటుక బట్టీ యజమానిపై కేసు నమోదు చేసి, అతడి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కటికె రవిప్రసాద్ పేర్కొన్నారు.

## ముత్తారం విండో చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం



డిప్యూటీ రిజిస్ట్రార్‌కు అవిశ్వాస తీర్మాన కాపీ అందజేస్తున్న డైరెక్టర్లు

ముత్తారం(మంథని): ముత్తారం సింగిల్‌విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, వైస్ చైర్మన్ పోతిపెద్ది రమణారెడ్డిపై గురువారం 9 మంది డైరెక్టర్లు పెద్దపల్లిలో సహకార సంఘం డిప్యూటీ రిజిస్ట్రార్ రాంమోహన్‌కు అవిశ్వాస నోటీసులు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాజిరెడ్డి, రమణారెడ్డి చైర్మన్, వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. సొసైటీలో 13 మంది డైరెక్టర్లకు గాను 8మంది బీఆర్ఎస్, ఐదుగురు కాంగ్రెస్ పార్టీకి చెందినవారు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు కాంగ్రెస్‌లో చేరికతో అవిశ్వాసానికి కోరం నిండింది. దీంతో డైరెక్టర్లు అల్లాడి యాదగిరిరావు, ఏలువాక కొమురయ్య, గుజ్జ గోపాల్‌రావు, కొంకటి మల్లయ్య, నాయిని పార్వతి, మద్దెల వెంకటలక్ష్మి, ముడుసు ఓదెలు, సముద్రాల వాణి, అల్లం గోవర్ధన్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు చొప్పరి సదానందం, నాగినేని జగన్‌మోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొద్ద బాలాజీ, నాయకులు పూదరి సర్వేశ్‌గౌడ్, గుజ్జ లింగారావు, రామగిరి మహేందర్, మద్దెల రాజయ్య, వెల్మారెడ్డి సంజీవరెడ్డి, గాదం శ్రీనివాస్, నల్లాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మొండి బకాయిలు.. రూ.5.11 కోట్లు

- రామగుండం బల్దియాకు ‘పన్ను’ పోటు
- ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని దుస్థితి
- భారీ బకాయిదారులకు లీగల్ నోటీసులు జారీ
- ఆదాయం పెంచడంపై దృష్టిపెట్టని పాలకులు, అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వద్ద ముక్కుపిండి ఆస్తి పన్ను వసూలు చేస్తున్న రామగుండం బల్దియా.. కొన్ని ప్రైవేటు వ్యాపార సంస్థలు, ప్రభుత్వ శాఖల నుంచి మాత్రం వసూలు చేయడంలో విఫలమవుతోంది. అలాగే ఖర్చులకు అనుగుణంగా ఆదాయం పెంచడంపై బల్దియా పాలకులు, అధికారులు దృష్టి సారించలేక పోతున్నారు. ఫలితంగా నిర్వహణ భారమై ఉద్యోగులకు జీతభత్యాలు, డీజిల్ బిల్లులు సకాలంలో చెల్లించక చేతులెత్తేస్తున్న పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈనెల 8వ తేదీ దాటినా కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి బల్దియాలో ఏర్పడింది.

**పురోగతి లేని ‘పెర్ఫార్మెన్స్’**



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

బల్దియాలో ఆస్తి పన్ను తీరుపై ఇటీవల అదనపు కలెక్టర్ అరుణశ్రీ వరుసగా సమీక్ష నిర్వహిస్తున్నారు. వారంలోగా 60 శాతం వసూళ్లు పూర్తి చెయ్యాలని టార్గెట్ విధించారు. అయినా ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. గురువారం వరకు కేవలం 36 శాతమే పూర్తయ్యింది. ఐదేళ్ల క్రితం నూటికి 90 శాతానికి పైగా వసూళ్లు సాధించిన బల్దియా, ఏయేటికాయేడు వెనకబడుతూ గతేడాది 63 శాతం వసూళ్లతో సరిపెట్టుకుంది. ఈసారి 100 శాతం లక్ష్యాన్ని సాధిస్తుందనుకుంటే మరో 40 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా, కనీసం 50 శాతానికి కూడా చేరువ కాకపోవడం గమనార్హం. ఇదే పరిస్థితి కొనసాగితే పెర్ఫార్మెన్స్ పూర్ కింద ప్రభుత్వం నుంచి విడుదలయ్యే గ్రాంట్లపై కూడా కోత పడనుంది. బల్దియాలో రూ.14.75 కోట్ల వరకు ఆస్తి పన్ను డిమాండ్ ఉండగా, ఇందులో సుమారు రూ.5.11కోట్ల మొండి బకాయిలు పేరుకుపోయాయి. కొత్త ఆదాయ మార్గాలపై దృష్టి సారించక పోగా, వసూలు చేయలేని అస్సెస్మెంట్ల డిమాండ్ తొలగించాలని ఇటీవల పురపాలక శాఖ ఉన్నతాధికారులకు బల్దియా అధికారులు నివేదిక సమర్పించారు.

**కోర్టుకు వెళ్లడంతో..**

బల్దియాలో భారీగా ఆస్తి పన్ను బకాయి పడినవారు ఏళ్ల తరబడి చెల్లించక మొండికేస్తున్నారు. అధికారులు లీగల్ నోటీసులు జారీ చేసినా స్పందన లేదు. ఇందులో కొందరు పన్ను కట్టకుండా కోర్టుకెక్కారు. ఇలా బల్దియాలో 12 కమర్షియల్ అసెస్మెంట్స్ నుంచి రూ.1.87కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. 15 ఏళ్లుగా పన్ను చెల్లించని నిరుయోగంగా ఉన్న ఓ సినిమా థియేటర్‌పై రూ.32లక్షలు, 13 ఏళ్లుగా పన్ను కట్టని నిరుపయోగంగా ఉన్న ఓ హోటల్‌పై రూ.29లక్షలు, 20 ఏళ్లుగా పన్ను కట్టని ఓ రైస్‌మిల్‌పై రూ.22లక్షలు, 12 ఏళ్లుగా ట్యాక్స్ చెల్లించని మరో రైస్‌మిల్‌పై రూ.17లక్షలు, 23 ఏళ్లుగా పన్ను కట్టని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీపై రూ.8లక్షలు, 11 ఏళ్ల కట్టకుండా ఉన్న ఓ పెట్రోల్‌బంక్‌పై రూ.23లక్షల బకాయిలు ఉన్నాయని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇవి మచ్చుకు కొన్నిమాత్రమే.. సుమారు రూ.5.11కోట్ల మేర మొండి బకాయిలు పేరుకుపోయాయి.

**ప్రభుత్వ కట్టడాలపై ఆస్తి పన్ను వసూలేదీ..?**

బల్దియాలో భారీగా ప్రభుత్వ సంస్థల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికే రామగుండం పోలీస్ కమిషనరేట్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, పోలీస్ గెస్టహౌజ్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, సిమ్స్ మెడికల్ కాలేజీ, జీజీహెచ్ ఆస్పత్రి భవనం పైఅంతస్తులో అదనపు గదుల నిర్మాణంతోపాటు ఆవరణలో మరో 85 పడకల కొత్త బ్లాక్ ప్రారంభించారు. విద్యుత్‌శాఖ కార్యాలయం ఆవరణలో అదనపు కట్టడాల నిర్మాణం జరిగింది. వీటన్నింటి నుంచి పన్ను వసూలు చేయాల్సిన బల్దియా రెవెన్యూ విభాగం, కేవలం మొక్కుబడిగా నోటీసులు ఇచ్చి ఉదాసీనతతో ఉంటోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఇలా చేస్తే ఆస్తి పన్ను పెరిగే అవకాశం..**

ఇంటింటికీ తిరిగి మరోసారి కొలతల సేకరణపై సర్వే నిర్వహిస్తే భారీగా ఆస్తి పన్ను పెరిగే అవకాశాలున్నాయి. పట్టణ ప్రణాళికా విభాగం స్పెషల్ డ్రైవ్ చేపట్టి కొత్తగా నిర్మించిన ఇళ్లను గుర్తించాలి. కొందరు అనుమతి లేకుండా పై అంతస్తులు, పెంట్ హౌస్‌లు నిర్మించుకున్నారు. వాటిని గుర్తించి టాక్స్ రివైజ్ చేయాలి. మార్కండేయకాలనీ, సప్తగిరికాలనీ, శారదానగర్, ఎన్టీపీసీలోని కృష్ణానగర్, తదితర ఏరియాల్లో రోడ్డు వైపు నివాసాలు కమర్షియల్‌గా మారిపోయాయి. ఇంటి పన్ను కమర్షియల్ కేటగిరీకి మార్చాలి. ఖాళీగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను అద్దెకివ్వాలి. మున్సిపల్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో అద్దె ప్రాతిపదికన నడుస్తున్న బ్యాంకు, టెలిఫోన్ టవర్స్ తదితర వాటిని టాక్స్ రివైజ్ చేయాలి. న్యూ అశోక్ టాకీస్ ఎదుట ఉన్న షాపుల అద్దె వసూలు చేయాలి. మార్కెట్, పశువధశాలలో తైబజారు రుసుము రెగ్యూలర్‌గా వసూలు చేయాలి.

## క్లుప్తంగా

### దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం ప్రతినిధులు

**రామగుండం:** కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం అంతర్గాం మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రతినిధులు ఎల్.భీమన్న, మేర్గు చంద్రయ్య, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్, కొల్లూరి మల్లేశ్, వేల్పుల సాంబయ్య, నామాల మహిపాల్, కట్ల తేజేశ్వర్ తదితరులున్నారు.

### ఆర్టీసీ బస్సు నుంచి కిందపడిన వృద్ధురాలు



వృద్ధురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

**సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి):** సుల్తానాబాద్ పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా వద్ద గురువారం ఓ వృద్ధురాలు ఆర్టీసీ బస్సు నుంచి కిందపడగా తీవ్ర గాయాలైనాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణంలోని శ్రీరాంనగర్‌కు చెందిన రాజమ్మ హుజూరాబాద్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లి జమ్మికుంట మీదుగా సుల్తానాబాద్‌కు ఆర్టీసీ బస్సులో వచ్చింది. చౌరస్తాలో బస్సు దిగే క్రమంలో జారిపడటంతో తల, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

### ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్

**గోదావరిఖని(రామగుండం):** పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా కోల్‌బెల్ట్ ప్రాంతంలో సంచరిస్తున్నారనే పుకార్లు షికార్లు కొడుతున్నాయి. చాలా మంది స్థానికులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. స్థానిక విఠల్‌నగర్ ఏరియాలో ట్రాన్స్‌జెండర్ సంచరిస్తున్న సీసీ పుటేజీ బయటకు రావడంతో వేరే ప్రాంతాల్లో సంచరిస్తున్న ముఠా సభ్యుడి పోలికలు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చాలా మంది పోలీసుల దృష్టికి తీసుకవచ్చారు. ఈక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు ట్రాన్స్‌జెండర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే విఠల్‌నగర్ ఏరియాలో సంచరించిన టాన్స్‌జెండర్‌ను గుర్తించి వివరాలు సేకరించారు. కాగా తన బంధువులు ఉండటంతో ఆ ప్రాంతానికి వెళ్లానని ఆ ముఠాకు తనకు ఏలాంటి సంబంధం లేదని వాపోయారు. దీంతో పోలీసులు పుకార్లుగా తేల్చి చెప్పారు.

**పుకార్లను నమ్మవద్దు: సీఐ ప్రమోద్‌రావు** సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను ప్రజలు నమ్మవద్దని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పేర్కొన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈవిషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని వివరించారు. ఎక్కడో జరిగిన సంఘటనకు ఇక్కడ ముడిపెట్టి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సరికాదన్నారు.





## ప్రకృతి ఒడి.. స్థానికుల సందడి

సంధ్యా సమయం వేళ ఒకవైపు కనువిందుగా సూర్యాస్తమయం.. మరోవైపు బోటింగ్ చేస్తూ ప్రకృతిలో మురిసిపోతూ స్థానికుల సంబరం అంతా ఇంతా కాదు. గురువారం సాయంత్రం కుటుంబ సమేతంగా బోటింగ్ చేస్తూ చెరువు అందాలు తిలకిస్తూ సెల్ఫీలు దిగుతూ సందడిగా మారింది పెద్దపల్లి ఎల్లమ్మ చెరువు. మినీ ట్యాంక్‌బండ్‌గా రూపొందిన చెరువు అందాలు ఆహ్లాదం పంచుతున్నాయి. ఉదయం వాకర్స్‌కు, సాయంత్రం కాలక్షేపానికి ఎల్లమ్మ చెరువు నిలయంగా మారిందని పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



## సమష్టి కృషితో లక్ష్యాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం బైద్య

**రామగిరి(మంథని):** సమష్టి కృషి, భద్రతతో విధులు నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఏపీఏ ఎస్‌వోటూ జీఎం డి.బైద్య అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సింగరేణి సాధిస్తున్న ప్రగతి, నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు ప్రణాళికల గురించి వివరించారు. యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించి భద్రతతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలన్నారు. సంస్థ అభివృద్ధికి పలువురు ఉద్యోగులు అందించిన సలహాలను అధికారులు స్వీకరించారు. సమావేశంలో ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఐఈడీ డీజీఎం కె.చంద్రశేఖర్, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, క్వాలిటీ అధికారి బీవీ.సత్యనారాయణ, ఎస్టేట్స్ అధికారి ఎస్.శ్యామల, డీవైపీఎంలు కె.మారుతి, గుర్రం శ్రీహరి, సునీల్‌ప్రసాద్, సీనియర్ పీవోలు రాజేశం, మతీన్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ–3లో డీఎంఎస్ పర్యటన



ఓసీపీ–2 రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎంఎస్ నాగేశ్వర్‌రావు

**రామగిరి(మంథని):** ఆర్జీ–3 పరిధి ఏపీఏ గని, ఓసీపీ–1,2లలో గురువారం డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మైనింగ్) హైదరాబాద్ రీజియన్–2 ఎస్.నాగేశ్వర్‌రావు పర్యటించారు. ఓసీపీ–1, 2లలో హైవాల్ బెంచ్‌లు, ఏపీఏ గనిలో 3వ పంచ్ ఎంట్రీ లొకేషన్లను పరిశీలించారు. అనుక్షణం భద్రతతో విధులు నిర్వహించాలని, రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తి సాధించాలన్నారు. అనంతరం రక్షణ, ఉత్పత్తిపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఆయన వెంట కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె.గురువయ్య, ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ఏరియా సేఫ్టీ అధికారి సీహెచ్ వెంకటరమణ, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, మేనేజర్లు కేవీ రామారావు, కె.జనార్దన్ తదితరులు ఉన్నారు.

## మాదిగలకు రాజకీయ వాటా దక్కేవరకూ పోరాటం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వరణ్‌కౌర్, తదితరులు

**పెద్దపల్లిరూరల్:** మాదిగలను రాజకీయపార్టీలు కేవలం ఓటర్లుగానే పరిగణిస్తున్నాయని కానీ, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ మాదిగలకు పోటీ చేసే అవకాశాన్ని కల్పించాలని మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్‌సన్నీ డిమాండ్ చేశారు. పంజాబ్ రాష్ట్రంలోని బుంగాసాహిబ్ గ్రామంలో గురువారం కాన్షీరాం సోదరి స్వరణ్‌కౌర్, మేనల్లుడు రవీందర్‌సింగ్ చేతుల మీదుగా మార్చి 4న తలపెట్టిన చలో పెద్దపల్లి పోస్టర్ ఆవిష్కరించారు. అంతకుముందు కాన్షీరాం కుటుంబీకులకు సురేందర్ వస్త్రాలు అందజేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు కనీసం రెండు స్థానాలను కేటాయించాలని కోరారు. మార్చి 4న మాదిగశక్తి ఆధ్వర్యంలో భీమ్‌జ్యోతి ర్యాలీ తలపెట్టామని, రాజకీయాలకతీతంగా అందరూ పాల్గొనాలని కోరారు. సురేందర్ చేపట్టిన పోరాటం విజయవంతం కావాలని స్వరణ్‌కౌర్ ఆకాంక్షించారు. జిల్లా కన్వీనర్ కల్లెపల్లి రవి, కో కన్వీనర్ ఈదునూరి ప్రేంకుమార్ తదితరులున్నారు.

## ట్రాక్టర్, బైక్ ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

**ముత్తారం(మంథని):** మండల కేంద్రంలోని పెద్దపల్లి ప్రధాన రహదారిలో కాసర్లగడ్డ వద్ద గురువారం రాత్రి ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాలు.. పారుపల్లికి చెందిన భూషనవేని రాజు, సంగె రమేశ్, ఇనుముల సురేశ్ బైక్‌పై ముత్తారం నుంచి తమ స్వగ్రామానికి వెళ్తుండగా, ముత్తారం నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు, రమేశ్‌కు తీవ్ర, సురేశ్‌కు సల్ప గాయాలైనాయి. ఎస్సై మధుసూదన్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా ముత్తారంలోని పెద్దమ్మ ఆలయం వద్ద ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిసింది.

## అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లిన కారు

**యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):** రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీ డాంబర్ ప్లాంట్ సమీపంలో గురువారం రాత్రి కారు ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతనకాలనీకి చెందిన సింగరేణి కార్మికుడి కారు గోదావరిఖని నుంచి పోతనకాలనీకి వస్తున్న క్రమంలో డాంబర్ ప్లాంట్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. కారులో ఒక్కరే ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. గోదావరిఖని టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

## ఓసీపీ బ్లాస్టింగ్‌లపై డీడీఎంఎస్ విచారణ



స్థానికులతో మాట్లాడుతున్న డీడీఎంఎస్ వెంకన్న

**గోదావరిఖని(రామగుండం):** ఓసీపీ–3 ప్రాజెక్టు బ్లాస్టింగ్‌లతో ఇళ్లు బీటలు వారుతున్నాయని, దుమ్ము వచ్చి ఇళ్లలోకి చేరుతోందని ప్రజలు డీడీఎంఎస్ వెంకన్నకు ఫిర్యాదు చేశారు. ఫైట్‌ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఫిర్యాదు మేరకు గురువారం డీడీఎంఎస్ స్థానిక 7బీ కాలనీలో పర్యటించి వాస్తవాలు తెలుసుకున్నారు. ఓసీపీ బ్లాస్టింగ్ సమయంలో లేస్తున్న దుమ్ము మూలంగా ఉండలేకపోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్ కోసం విచారణకు వచ్చిన సమయంలో మాత్రం శబ్దం తక్కువగా ఉంటుందని, దుమ్ము లేవకుండా చర్యలు తీసుకుంటారని ప్రజలు పేర్కొన్నారు. ఈసందర్భంగా దినేశ్, పెద్దెల్లి ప్రకాశ్ మాట్లాడుతూ, ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారులు, ప్రైవేట్ ఓబీ తీరుపై త్వరలో హైకోర్టుకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్లాస్టింగ్‌ల మూలంగా ఇండ్లు నేలమట్టం అవుతున్నాయని, ఈవిషయంలో అధికారులు జోక్యం చేసుకుని దుమ్ము లేవకుండా, బ్లాస్టింగ్ శబ్దాలను తగ్గించేలా చూడాలని కోరారు.

## ఆలస్యంగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్



తెలంగాణ ఎక్స్‌ప్రెస్

**రామగుండం:** హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీ వెళ్లు రైలు నం.12723 తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రామగుండంకు ఉదయం 9.30 గంటలకు రావాల్సి ఉండగా (11.30 గంటలు ఆలస్యం) రాత్రి 9 గంటలకు రానుంది. న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లు రైలు నం.12724 తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు రామగుండంకు మధ్యాహ్నం 12.30 గంటలకు రావాల్సి ఉండగా (14 గంటల ఆలస్యం ) శుక్రవారం వేకువజామున రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

## 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**హుజూరాబాద్‌రూరల్:** మండలంలోని కందుగుల గ్రామశివారులోని ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్ గురువారం తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా గ్రామ శివారులోని రైస్‌మిల్‌లో సుమారు 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యంలో సుమారు 20క్వింటాళ్లు నూకలుగా మార్చారని తెలిపారు. రేషన్ బియ్యాన్ని పట్టణానికి చెందిన అప్పని రమేశ్, ఎలగందుల ప్రకాశ్, ఉప్పల్ గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్రీనివాస్ సదరు మిల్ యాజమానికి ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## కమాన్‌పూర్ విద్యార్థుల విహారయాత్ర



**కమాన్‌పూర్(మంథని):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులను గురువారం ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు ఆధ్వర్యంలో విహారయాత్రకు తీసుకెళ్లారు. రామప్ప, లక్నవరం సరస్సు, ఖిలా వరంగల్, వేయిస్తంభాల గుడి, భద్రకాళి ఆలయాలతో పాటు పలు పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. విద్యార్థుల వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.



## బొగ్గుబాయి వార్తలు

## రక్షణతో విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం గురువయ్య

- కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య

**రామగిరి(మంథని):** సింగరేణిలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి ఎల్లప్పుడు రక్షణతో విధులు నిర్వహించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె.గురువయ్య అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎన్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. గనులలో విధులు నిర్వహిస్తున్నప్పుడు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించలన్నారు. సమావేశంలో ఏరియా ఇంజనీర్లు పి.ఎలీషా, సీతారామం, ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, డి.బైద్య, ఏరియా సేఫ్టీ అధికారి సీహెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు అధికారులు ఎస్.రాధాకృష్ణ, కె.నాగేశ్వర్‌రావు, కె.రమేశ్, ఏరియా సర్వే అధికారి జైనుల్లాబద్దీన్, ఐఈడీ, సీహెచ్‌పీ డీజీఎంలు కె.చంద్రశేఖర్, కాశీవిశ్వేశ్వరరావు, ప్రాజెక్టు ఇంజినీర్లు ఆర్.శ్రీనివాస్, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఏపీఏ గని సందర్శన**

ఆర్జీ–3 పరిధి ఏపీఏ గనిని గురువారం కార్పొరేట్ సేఫ్టీ జీఎం కె.గురువయ్య సందర్శించారు. కంట్రోల్ రూం పని విధానంలో భాగంగా గనిలోని స్ట్రాట కంట్రోల్, లాంగ్‌వాల్ ఫేస్ మానిటరింగ్, ట్యూబ్ బెండల్ మానిటరింగ్, కార్గో కన్వేర్ సిస్టం, రెస్పాండింగ్ తదితర సిస్టంలను పరిశీలించారు. కంట్రోల్ రూంలో వినియోగిస్తున్న పలు సిస్టంల గురించి జీఎం కె.వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వరరావు వివరించారు. కంట్రోల్ రూం అభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని సేఫ్టీ జీఎం పేర్కొన్నారు. ఎకో ఫ్రెండ్లీ విధానం పాటించాలని, ఐటీ అప్లికేషన్స్ వినియోగించుకోవాల్సిందిగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్‌వోఎం కె.జనార్దన్, అడిషనల్ మేనేజర్ కె.శ్రీకాంత్, వెంటిలేషన్ అధికారి కె.కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'సీఎం నియామక పత్రాలు ఇవ్వడాన్ని ఖండిస్తున్నాం'

- ఏఐటీయూసీ కేంద్ర నాయకుడు వైవీ రావు



మాట్లాడుతున్న వైవీ రావు

**యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం):** సింగరేణిలో కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు సీఎం రేవంత్ రెడ్డి ఇవ్వడాన్ని ఖండిస్తున్నామని ఏఐటీయూసీ కేంద్ర నాయకుడు వైవీ రావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం సింగరేణిలో రాజకీయ జోక్యం చేసుకుని కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాల్సిన డబ్బును వేరే వాటికి వాడుకుందని, రూ.28 కోట్ల బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. దీంతో ఓటమి పాలైందని గుర్తు చేశారు. తిరిగి అదే దారిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించడం సరైన పద్ధతి కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు, రైతులు, అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్.ప్రకాష్, రాజారత్నం, ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి జిగురు రవీందర్, ఎంఆర్‌సీ రెడ్డి, అన్నారావు, రమేశ్, డీటీ రావు, సంపత్, మల్లేశ్, శ్రీనివాస్, అనిల్‌కుమార్, సంపత్‌రెడ్డి, సాంబయ్య తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన బొగ్గుతోనే సంస్థకు భవిష్యత్

- ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు



మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

**గోదావరిఖని(రామగుండం):** వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందిస్తేనే సంస్థపై నమ్మకం పెరుగుతుందని, తద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం ఓసీపీ–1 సీహెచ్‌పీలో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించడంతోపాటు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, అంకిత భావం, సమష్టి కృషితో ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 77 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను అధిగమించడానికి, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. సమావేశంలో ఏరియా ఇంజినీర్ పి.ఎలీషా, ప్రాజెక్ట్ అధికారులు ఎస్.రాధాకృష్ణ, ఎస్.రమేశ్, డీజీఎం ఐఈడీ కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి శిక్షణతో ప్రయోజకులు కావాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్

**గోదావరిఖని(రామగుండం):** సింగరేణి యాజమాన్యం ఎంతో వ్యయప్రయాసల కోర్చి అందిస్తున్న స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవితంలో రాణించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో 55 మందికి వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వోల్వో డంప్ ట్రక్ శిక్షణను ప్రత్యేకించి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ అర్హత గల నిరుద్యోగ యువతకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జీవనోపాధి కల్పించుటకు సింగరేణి (సీఎస్ఆర్) నిధుల నుంచి వివిధ ఏరియాల్లో ఎంపికయిన వారికి టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టీటీసీ) ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం 55 మందికి శిక్షణ ఇస్తున్నామని, శిక్షణ పొందిన యువత భవిష్యత్‌లో ఆపరేటర్స్‌గా స్థిరపడి జీవనోపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ ఆరెల్లి పోషం, సీఎంఓఏఐ అధ్యక్షుడు మల్లేశ్, ఎస్ఓటూ జీఎం రాంమోహన్, ఏజీఎం సీహెచ్.లక్ష్మీనారాయణ, ఏరియా ఇంజినీర్ రామ్మూర్తి, టీటీసీ డీజీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## 'సింగరేణిలో రాజకీయ జోక్యం తగదు'



మాట్లాడుతున్న ఎల్లాగౌడ్

**గోదావరిఖని(రామగుండం):** సింగరేణిలో రాజకీయ జోక్యం తగదని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ అన్నారు. గురువారం భాస్కర్‌రావుభవన్‌లో మాట్లాడారు. సింగరేణిలో నూతన అపాయింట్ అయ్యే డిపెండెంట్లకు యాజమాన్యం రాజకీయ జోక్యంతో హైదరాబాద్‌లో ఆర్డర్లు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. గతంలో యాజమాన్యం అపాయింట్మెంట్ ఆర్డర్లను ఏరియా జీఎం కార్యాలయాల్లో ఇచ్చే వారని, సంస్థలో విపరీత రాజకీయ జోక్యం వల్లే కంపెనీ ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించాలన్నారు. నిర్వహణ విషయంలో సంస్థకు స్వేచ్ఛ ఇవ్వాలని, ఆర్థికంగా నష్టం చేసే విధానాన్ని మానుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, ఎస్.వెంకట్‌రెడ్డి, సిర్ర మల్లికార్జున్, ఎంఏ గౌస్, తాని రాజబాబు, బండారి శ్రీనివాస్, మల్లేశ్, తొడుపునూరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల కనీస పెన్షన్ రూ.వెయ్యి పెంచాలి



యాదగిరి సత్తయ్య

**గోదావరిఖని(రామగుండం):** దేశవ్యాప్త బొగ్గుగని కార్మికుల కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచాలని కోరుతూ సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి కోరినట్లు బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. ఢిల్లీలో బొగ్గుశాఖ కార్యదర్శి అమృత లాల్‌మీనాను కలిసి గత సీఎంపీఎఫ్ బోర్డు సమావేశంలో కనీస పెన్షన్ రూ.వెయ్యికి పెంచాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే అమలు చేయాలని, దీని కోసం నోటిఫికేషన్ జారీ చేయాలని కోరరు. దీనిపై సానుకూలంగా స్పందించిన సెక్రెటరీ త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.